క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ



వేదాద్రి(జగ్గయ్యపేట): మిచాంగ్ తుఫాన్ కారణంగా విజయవాడ కమీషనరేట్ పరిధిలోని కృష్ణానది తీర లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ అజిత సూచించారు. వేదాద్రిలోని కృష్ణానది లోతట్టు ప్రాంతాలను సోమవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. డీసీపీ అజిత మాట్లాడుతూ సీపీ ఆదేశాల మేరకు నందిగామ, జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించినట్లు చెప్పారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆమె వెంట నందిగామ ఏసీపీ జనార్దన్‌నాయుడు, సీఐలు నాగేంద్రకుమార్, జానకిరామ్, ఎస్‌ఐలు కృష్ణబాబు, రామారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతులకు అవగాహన

నందిగామ: పట్టణ శివారు అనాసాగరంలో పంట పొలాలలో మందులు పిచికారి చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి ఖాసిం రైతులకు అవగాహన కల్పించారు. కొట్టేవా అగ్రి సెన్సెస్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

270 మందికి వైద్యపరీక్షలు



పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో అసోసియేటెడ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) ఆధ్వర్యంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీ సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎంపీపీ షేక్ మలక్ బషీర్ ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పేదల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు గోసంగి జాన్‌బాబు మాట్లాడుతూ మొత్తం 270మందికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎం. రాజారావు, ఎర్నెస్టు పాల్ పాల్గొన్నారు.

స్పందనకు పది అర్జీలు



నందిగామ: సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పి.సాయిబాబు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ పదిమంది అర్జీలు అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఆరు అర్జీలు, విద్యుత్ శాఖ, హౌసింగ్, మున్సిపాలిటీకి సంబంధించి ఒక్కొక్క అర్జీ అందినట్లు ఆర్డీవో తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేయడంతోపాటు ఆయా సమస్య పరిష్కారమయ్యేంతవరకు మానిటరింగ్ చేస్తామని ఆర్డీవో వివరించారు.

వీరులపాడులో ఆరు అర్జీలు..

వీరులపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఆశయ్య నాయక్ తెలిపారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

హనుమత్ దీక్షల విరమణ



రావిరాల(జగ్గయ్యపేట): మండలంలోని రావిరాలలో హనుమత్ దీక్షా విరమణ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. 41రోజుల పాటు దీక్ష తీసుకున్న స్వాములచే గ్రామంలోని ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద గురుధాం తాత్వికుడు గెంటేల వెంకటరమణ ప్రత్యేక పూజలు చేసి దీక్ష విరమింపజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని సూచించారు. ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు చేసి అన్నదానం చేశారు.

7న విగ్రహాల ప్రతిష్ట

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చెరువుబజారులోని శ్రీమార్కండేయస్వామి దేవస్థానంలో ఈనెల 7వతేదీ ఉదయం 8.32గంటలకు శ్రీమేధా దక్షిణామూర్తి, కాలభైరవ, చండీశ్వర, కుమారస్వామి, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠించనున్నట్లు దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త తుమ్మా గురవయ్య సోమవారం తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కంభంపాడులో అభివృద్ధి పరుగులు

- రూ.3.58కోట్లతో మునుపెన్నడూలేని అభివృద్ధి..
- పెరిగిన మౌలిక వసతులు
- తీరిన సమస్యలు



రూ.44.50లక్షలతో నిర్మించిన వ్యవసాయ సొసైటీ నూతన భవనం

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలంలోని కంభంపాడులో అభివృద్ధి పరుగులు పెడుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆయా పథకాల కింద నిధులు కేటాయింపులు చేయించడంతో గ్రామాల్లో మౌలికవసతులు పెరిగాయి. సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.43లక్షలతో సచివాలయం..

గ్రామంలో రూ.43లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనాల పనులు తదిదశకు చేరుకున్నాయి. త్వరలోనే ఈ భవనాలను ప్రారంభించనున్నారు. రూ.44.50 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామస్తుల సౌకర్యార్థం ఏటీఎం, లాకర్ సదుపాయాలు కల్పించారు.

రూ.2.14కోట్లతో పాఠశాలల అభివృద్ధి...

నాడు-నేడు పథకంలో భాగంగా గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఫేజ్-1, 2లో మొత్తం రూ.1.20 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం

విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించారు. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను రూ.51లక్షలు, ఎంపీపీ (మెయిన్) పాఠశాలను రూ.24 లక్షలు, బీసీ కాలనీలోని పాఠశాలను రూ.19 లక్షలతో అభివృద్ధి చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ హంగులు సమకూర్చుకున్నాయి.

రూ.34లక్షలతో డ్రైనేజీ, సీసీరోడ్లు..

రూ.14లక్షలతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.20లక్షలతో డ్రైనేజీ సదుపాయం కల్పించారు. రూ.2.30లక్షలతో హెల్త్ క్లీనిక్‌ను అభివృద్ధి చేశారు. సొంతిళ్లు లేని పేదల కోసం గ్రామంలో 126 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరు చేయడంతోపాటు ఇంటిని కూడా మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారుల ఇళ్లనిర్మాణం చేపట్టగా, పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

కోట్ల రూపాయలతో అభివృద్ధి...



జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. మునుపెన్నడూ లేనివిధంగా కోట్లాది రూపాయిల నిధులతో గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు కల్పించాం.

– బేతపూడి పున్నమ్మ, సర్పంచి

అందరి సహకారంతో...



సుమారు శతాబ్దం చరిత్ర కలిగిన వ్యవసాయ సొసైటీకి రూ.44.50లక్షలతో నూతన భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించాం. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం కూడా గ్రామాభివృద్ధికి దోహదపడింది. సీఎం జగనన్న, ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది.

–వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



ప్రత్యేకాలంకరణలో కూడలి సంగమేశ్వరస్వామి



నందిగామలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలులోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నందిగామ: కార్తికమాస సోమవారాన్ని పురస్కరించుకుని నందిగామ నియోజకవర్గ పరిధిలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివెళ్లి కార్తికదీపాలు వెలిగించారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నందిగామ శివారు పల్లగిరిగుట్టపై ఉన్న భవాని శంకరస్వామి స్వయంభు శివలింగం, రైతుపేట డౌన్‌లో మున్నేటి తీరంలోని విజ్ఞాన నందీశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు చేశారు. దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయ శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంసంధ్యా సమయంలో ఆయా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సామూహిక దీపోత్సవ కార్యక్రమాలను భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు ..

పెనుగంచిప్రోలు: కార్తికమాసం సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శంభో శంకర... శంభో అంటూ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. గ్రామంలో వేంచేసియున్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. మహిళలు కార్తికదీపాలు వెలిగించటంతోపాటు మునేరులో అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నీటిలో వదిలారు. అదేవిధంగా వత్సవాయి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు



నందిగామ టౌన్: ఇటీవల విజయవాడ నలంద పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సూర్యరశ్మిని వినియోగించి విద్యుత్ ఆదా చేసుకునే విధానంపై కేటగిరి-1లో నందిగామకు చెందిన విద్యార్థి షఫ్వాన్ విశేషప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన ఏడోతరగతి విద్యార్థి షఫ్వాన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులు నందిగామకు గర్వకారణమని కొనియాడారు. జాతీయస్థాయి ఎగ్జిబిషన్ లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి నూరుద్దిన్, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసేవారికి మంచి భవిష్యత్తు

ఎమ్మెల్సీ అరుణకుమార్



గండేపల్లిలో సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, నాయకులు

గండేపల్లి(కంచికచర్ల) : పార్టీ కోసం పనిచేసేవారందరికీ భవిష్యత్‌లో తప్పకుండా మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లిలో సోమవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. పార్టీ నాయకులు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

గ్రామ సమన్వయకర్తల ఎన్నిక...

వైఎస్సార్ సీపీ గండేపల్లి సమన్వయకర్తలుగా మట్టా శ్రీనివాసరెడ్డి, మండడపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరు సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి భాగ్యలక్ష్మిల సహకారంతో గ్రామాభివృద్ధికి పని చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. సమావేశంలో ఉపసర్పంచి బి.సుబ్బారావు, నాయకులు కె.రంగారావు, సుంకు బాలాజీ, సంగం దేవరాజు, తలమాల కిషోర్, బి.సుధాకర్, వేల్పుల రమేష్, పరిటాల రాము పాల్గొన్నారు.

వేములపల్లి కన్వీనర్‌గా పసుపులేటి...

మండలంలోని వేములపల్లి గ్రామపార్టీ కన్వీనర్‌గా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పసుపులేటి వెంకటేశ్వర్లను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఉయ్యూరు అనుమాయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నల్లపు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురునాథ స్వామికి పూజలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి ఒడ్డున వేంచేసియున్న శ్రీగురునాథ(గురప్ప)స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పాలపొంగళ్లు పెట్టి పూజలు చేశారు. జగ్గయపేటతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

తెలుగువారు గర్వించే గాయకుడు ఘంటసాల



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలను పట్టణంలో ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలు కళారాధన సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదాడరోడ్‌లోని ఘంటసాల విగ్రహానికి వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పేట గాయత్రీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కలవకొలను ఆంజనేయశర్మ, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు కొమరగిరి భరద్వాజ్, పలువురు కళాకారులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఘంటసాల ఆలపించిన మధురమైన గీతాలు నేటికి తెలుగువారి మదిలో నిలిచిపోయాయని కొనియాడారు. అనంతరం హార్మోనిస్ట్ సంజీవరావు, కళాకారిణి కాల్వ అరుణను శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం కమిటీ కార్యదర్శి కొండూరి నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి కళారాధన సేవాసమితి అధ్యక్షుడు మీసాల బాబ్జి అధ్యక్షత వహించగా, సేవాసమితి ప్రతినిధులు అబ్బాస్ ఆలీ, శామ్యూల్, కాంతారావు, కృష్ణమూర్తి, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

నేటి సాధికార బస్సు యాత్ర వాయిదా



ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: మిచాంగ్ తుఫాన్ కారణంగా మంగళవారం నందిగామలో నిర్వహించాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ వాయిదా పడిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వాయిదా పడిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 10న జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

ప్రభుత్వ విప్ ఉదయభాను



విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రజలంతా తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచించారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని పేర్కొన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఫోన్ ద్వారా తనను, కార్యాలయ సిబ్బందిని ఎల్లవేళలా సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, పాత గృహాల్లో ఉన్నవారు తుఫాన్ షెల్టర్ ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వారికి కావాల్సిన ఆహారం, నిత్యావసర వస్తువులు అందేలా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, వలంటీర్ల సహకారంతో సచివాలయ సిబ్బంది, అధికార యంత్రాంగం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. పరిస్థితిపై తాను ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నానని వివరించారు.

అన్నదాతల్లో తుఫాన్ కలవరం



అనిగండ్లపాడులో యంత్రాలతో చేపట్టిన వరి కోతలు



వత్సవాయి మండలం కంభంపాడు వద్ద నేలవాలిన వరి పంట



జుజ్జూరు కల్లాల్లో ధాన్యంపై కప్పిన పరదా పట్టలు



రామచంద్రునిపేటలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న రైతులు



పెనుగంచిప్రోలులో ట్రాక్టర్ ద్వారా ఇంటికి చేరుస్తున్న ధాన్యం బస్తాలు

పెనుగంచిప్రోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సోమవారం పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో కూడా వర్షపు జల్లులు పడటంతో అన్నదాతలు తీవ్ర భయాందోళనలకు గురతున్నారు. భారీ వర్షాలు పడితే వరితోపాటు ఇప్పుడే కోతలు కోస్తున్న మిర్చి తోటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని మునేరు ఆయకట్టున వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు కోతలు పూర్తిచేసి పొలాల్లో పనలు ఉంచారు. మరికొందరు ధాన్యం కూడా ఆరబోశారు. వర్ష ప్రభావం నేపథ్యంలో కొందరు యంత్రాలతో వరికోతలు కోయిస్తున్నారు. చివరికి గడ్డిని కూడా యంత్రాల ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. మిర్చి కోతలు, పత్తితీతలు జరుగుతున్నాయని ఇప్పుడు భారీ వర్షాలు పడితే పత్తి మొత్తం రాలిపోయి పాడవుతుందని రైతులు చెబుతున్నారు. తుఫాన్ కారణంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: తుఫాన్ కారణంగా జగ్గయ్యపేట మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిరుజల్లులు కురవటంతో రైతులు పంటను కాపాడకునేందుకు అప్రమత్తమయ్యారు. షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి, తక్కెళ్లపాడుల్లో కల్లాల్లోని పంటపై టార్పాలిన్ పట్టాలను కప్పారు. మరికొందరు రైతులు కల్లాల్లో ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించారు.

వీరలపాడు మండలంలో..

వీరులపాడు: తుఫాన్ కారణంగా మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడుతుండటంతో కల్లాల్లోని ఆరబోసిన వరి, మొక్కజొన్న దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. జుజ్జూరు, అల్లూరు తదితర గ్రామాల్లో కల్లాల్లోని పంటను కాపాడుకుందుకు పట్టాలు కప్పి ఉంచారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు

ఏడీఏ భవాని



మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ భవాని, ఏఈఓ వరలక్ష్మి

జగ్గయ్యపేట అర్బన్ : తుఫాను నేపథ్యంలో రైతులు నష్టపోకుండా వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఏడీఏ సి.భవాని తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని ఏవో వరలక్ష్మితో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వర్షానికి తడిసి తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కూడా నేరుగా మిల్లులకు చేరవేసేలా రైతుభరోసా కేంద్రాల ద్వారా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే కోతకోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలించేలా రైతులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఇప్పటివరకు 30 శాతం వరికోతలు పూర్తికాగా, 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 532 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకొని నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తిరువూరు: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుసర్వీసు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరులో ఈ బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం మీదుగా 25వ తేదీ రాత్రికి అరుణాచలం చేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి ఆలయాల దర్శనం అనంతరం 27వ తేదీ రాత్రి తిరువూరు చేరుతుందన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయం ఉందని తెలిపారు. వివరాలకు 98856 61835లో సంప్రదించాలని కోరారు.